
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 డిసెంబర్ 2022
5
తిరుపతి



నేడు తిరుమలకు రానున్న రాష్ట్రపతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈనెల 4, 5 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల, తిరుపతిలో పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డిలు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి 9.25 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని రాష్ట్రపతి తిరుమలలో రాత్రి బస చేయనున్నారు. సోమవారం ఉదయం 9.25 గంటలకు వరాహస్వామి, తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. 11.35 గంటలకు అలిపిరి వద్ద గోమందిరాన్ని సందర్శిస్తారు. 11.55 గంటలకు శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరి తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుంటారు. 1.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి ఢిల్లీ తిరుగు ప్రయాణం కానున్నారు. రాష్ట్రపతి మొదటిసారిగా తిరుపతి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ఆదేశించారు.

చిట్టీలతో ..'ఛీ'టింగ్ !

తిరిగివ్వాల్సిన సమయంలో పరార్
అధిక వడ్డీలనూ ఆశచూపి ప్రలోభాలు
ఐపిల పేరుతో రెండేళ్లలో 150 కోట్లు స్వాహా
బెంబేలెత్తుతున్న బాధితులు

● తిరుపతి తాతయ్యగుంట ప్రాంతంలో ఓ మిర్చి, చింతపండు వ్యాపారి చిట్టీల పేరుతో దందాకు తెరలేశాడు. తనకు పరిచయం ఉన్న ఓ ఎన్ఆర్ఐ భార్యను ప్రలోభపెట్టాడు. ప్రస్తుతం తిరుపతి శివారుల్లో కాపురముంటున్న ఆ కుటుంబం నుంచి ఒక్కొటి రూ. 20 లక్షల చొప్పున రెండు చిట్టీలు వేయించారు. చివరిదాకా కంతులు కట్టించుకుని తిరిగివ్వాల్సిన సమయంలో బోర్డు తిప్పేశాడు. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ తీవ్రంగా శ్రమించి ఆ వ్యాపారిని వెతికి పట్టుకున్నా ఫలితం లేకపోయింది.

● మంగళం ప్రాంతంలో ఉంటున్న ఓ వ్యక్తి రవాణా సంస్థలో పనిచేస్తున్నాడు. అతను కోట్లాది రూపాయల చిట్టీలు నిర్వహించేవాడు. కంతులు వసూళ్లు చేయడంలో దిట్టగా పేరుగాంచాడు. ఆఖరికి కరోనా కష్టకాలంలోనూ ముక్కుపిండి మరీ వసూళ్లు చేశాడు. అయితే తిరిగి చెల్లించాల్సిన సమయం రావడంతో చేతులెత్తేశాడు. 'ఇదంతా కరోనా ఎఫెక్ట్' అంటూ కలరింగ్ ఇస్తుండటం గమనార్హం. పైగా మంగళం నుంచి మకాం మార్చి అజ్ఞాతంలో ఉంటున్నట్టు సమాచారం.


● ఓ ప్రయివేట్ సంస్థలో ఏళ్ల తరబడి కంతులు చెల్లించిన ఓ మహిళ చిట్టీ డబ్బుల కోసం కాళ్లరిగేలా తిరిగింది. అయినా ఏమాత్రం స్పందించకపోగా దౌర్జన్యానికి దిగారు. దీంతో మీడియాను ఆశ్రయించింది. ప్రెస్‌మీట్‌కు ఏర్పాట్లు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆ సంస్థ నిర్వాహకులు 'మీ డబ్బులు ఇచ్చేస్తాం..ప్రెస్‌మీట్ పెట్టొద్దు.' అంటూ కాళ్లబేరానికి వచ్చారు. ఇది జరిగి నాలుగురోజులైనా ఇప్పటికీ డబ్బులు తిరిగి చెల్లించలేదని తెలుస్తోంది.

● తిరుపతిలో పేరుమోసిన ఓ బడా స్థిరాస్తి వ్యాపారి ఐదేళ్లుగా అందరినీ నమ్మించాడు. తిరుపతి, ఏర్పేడు, తిరుచానూరు, సూళ్లూరుపేట, నాయుడుపేటలో వెంచర్లు వేశాడు. ఆయా ప్రాంతాల రాజకీయనాయకులు, వ్యాపారులతో పరిచయం పెట్టుకుని వారి నుంచి పాతిక, యాభైలక్షలు ఇలా కోట్లాది రూపాయలు వడ్డీలకు తీసుకున్నాడు. ఆఖరికి ప్లాట్లకు అడ్వాన్సులంటూ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాల నుంచి రూ. 2- 10 లక్షల వరకు తీసుకున్నాడు. ఇలా నాలుగేళ్లు ఇక్కడి వారిని నమ్మబలికి భారీగా వసూలు చేసి పారిపోయి ఏడాది పైనే గడుస్తోంది. ఇతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా ప్రయోజనం లేక పోలీసులను ఆశ్రయించారు. ఆయన తాజాగా ఐపి దాఖలు చేయనున్నట్లు అతని వద్ద పనిచేసిన ఉద్యోగులు చెబుతున్నారు.

● తిరుపతి సుందరయ్యనగర్‌లో ఉంటున్న ఓ మహిళ చిట్టీపాటల పేరుతో లక్ష, రెండు లక్షలు..ఐదు లక్షలు...ఇలా పెద్దఎత్తున చుట్టుపక్కల వారి నుంచి కోట్లరూపాయలు వసూలు చేసింది. తెలుగు నమ్మకంగా వ్యవహరించిన ఆమె..తన కూతురు, అల్లుళ్లతోనూ చిట్టీలు నిర్వహింపజేసింది. పెద్దమొత్తంలో పోగేయడంతో తాను ఆర్థికంగా దివాళాతీశానంటూ కోర్టులో ఐపి దాఖలు చేసింది. దీంతో బాధితులు పోలీసుల్ని ఆశ్రయించినా చేసేది లేక చేతులెత్తేసిన వైనం.

● చెన్నారెడ్డి కాలనీలో ఉంటున్న మరో వ్యక్తి ఓ ప్రయివేటు ఆసుపత్రి పనిచేస్తున్న ఓ మహిళ దగ్గర చిట్టీలు వేశారు. ఆ చిట్టీల సొమ్ము వడ్డీలకు అతడికే ఇచ్చారు. ఇలా రెండేళ్లు వడ్డీ సక్రమంగా చెల్లించిన సదరు వ్యక్తి ఇల్లు వదిలి పరారయ్యాడు. ఇతడు చాలామందిని ఇదే రీతిలో మోసం చేసినట్లు గ్రహించి లబోదిబోమన్నారు. ఇలా ఒకరిద్దరు కాదు..పదులు దాటి..వందల సంఖ్యలో బాధితులు ఇలాంటి కేటుగాళ్ల బారిన పడి మోసపోతుండటం గమనార్హం.

ప్రజాశక్తి - తిరుపతి



ఆధ్యాత్మిక, విద్యా, వైద్యకేంద్రంగా భాసిల్లుతున్న తిరుపతి నగరంలో ఇటీవల కేటుగాళ్లు పాగా వేశారు. వారికి పెద్ద వ్యాపారులున్నాయన్నట్లు ప్రచారం చేసి సామాన్యులను నమ్మబలికిస్తున్నారు. అధిక వడ్డీలు ఆశచూపి కొన్ని రోజులు, నెల పాటు సక్రమంగా చెల్లిస్తూ చివరికి జెండా ఎత్తేస్తున్నారు. ఒకవేళ వారిని పోలీసులు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేస్తే ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపి) దాఖలు చేస్తూ దర్జాగా తప్పించుకుంటున్నారు. ఇలా ఒకటి రెండు కాదు.. రెండు,మూడేళ్లలో దాదాపు రూ 150 కోట్లపైగా దోచుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల కాలంలో బయటిప్రాంతాల నుంచి తిరుపతికి వలస వస్తున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వారిలో కొందరు హడావిడి చేసే కార్లు, పెద్దపెద్ద ఇళ్లలో అద్దెకు దిగుతున్నారు. కాంట్రాక్ట్, ఇతర వ్యాపారాల పేరిట స్థానికులను నమ్మబలికిస్తున్నారు. ఇలా వచ్చిన వారు అందిన కాడికి సొమ్ము వసూలు చేసుకుని పరారవుతున్నారు. సామాన్యులే లక్ష్యంగా చేసుకుని కొందరు మోసం చేస్తున్నారు. ఇలాంటివి ఇటీవల కాలంలో అధికమవుతున్నాయి. మరికొందరు బదాబాబులుగా చలామణి అవుతున్న వారిలో ఎక్కువ మంది బయటి వ్యక్తులే ఉంటున్నారు. వారితో ఇతర ప్రాంతాల్లో ఇలాంటి మోసాలు చేసి ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడా మోసం చేసి మరో ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. సామాన్యులు కూడా అధికవడ్డీల ఆశతో వారి వలలో చిక్కుతున్నారు. వడ్డీలకు తీసిచ్చేవారికి (దళారీ) పర్సంటేజీలు ఇస్తున్నారు. నమ్మించడం, మోసం చేయడం పరిపాటిగా పెట్టుకుంటున్న వారంతా పెద్దలుగా చలామణి అవుతూ చివరినిమిషంలో కోర్టులో ఐపి దాఖలు చేస్తున్నారు. ఇలాంటి కేటుగాళ్ల పట్ల అప్రమత్తతతో వ్యవహరించకుంటే కూడబెట్టుకున్న సొమ్ములంతా స్వాహాయనం అవుతుండటం గమనార్హం. ఇదే తీరుగా కొందరు స్థిరాస్తి వ్యాపారులు అధికవడ్డీల ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారు.

ఓటీఎస్ తూచ్

ఏడాదిగా ఎదురు చూస్తున్న బాధితులు
నిషేధిత జాబితా పేరుతో రిజిస్ట్రేషన్లు నిలుపుదల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నామమాత్రం రుసుము చెల్లిస్తే చాలు ఇళ్లపై సర్వ హక్కులు వస్తాయి. భవిష్యత్తులో మీ కుటుంబ సభ్యుల పేరుతో బదలాయించుకునేందుకు, విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. ఇళ్లపై ఉన్న రుణం, వడ్డీ మాఫీ చేస్తాం. ఇదీ నాడు ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) ప్రక్రియ ప్రారంభించే సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలు. ఇందుకోసం గ్రామీణ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా నిధులు వసూలు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా తహశీల్దార్లు ఆమోదముద్ర వేసిన ఇళ్లను ఇతరుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేసేందుకు వెళ్లిన సమయంలో లబ్ధిదారులకు సమస్యలు ఎదురవుతున్నాయి. లబ్ధిదారుల ఇళ్ల నిషేధిత, అసైన్డ్ భూముల జాబితాలో ఉన్నాయని పేర్కొంటూ రిజిస్ట్రేషన్లు తిరస్కరిస్తున్నారు. శాశ్వత హక్కులు రాకపోవడంపై బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాలు మంజూరు చేసిన వివిధ గృహ నిర్మాణాల ద్వారా నిరుపేదలు రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని పేదలు రుణాలు కట్టలేక వాయిదా వేస్తూ వస్తున్నారు. ఇటువంటి వారికి మంచి అవకాశం కల్పిస్తున్నామని, కేవలం నివాస హక్కులు మాత్రమే ఉన్న పేదలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తు న్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు రూ. 10వేలు, మున్సిపాలిటీల్లో రూ. 15వేలు, కార్పొరేషన్ల పరిధిలో రూ. 20వేలు చెల్లిస్తే ఆత్మీయత... అనురాగం సరిపోతుందని పేర్కొంటూ కొత్తగా వన్ టైమ్ మా అభివద్ధికి వేసిన పూబాట.. అంటూ ప్రగల్భాలు పలికారు. అన్ని దస్త్రాలను పరిశీలించి తహశీల్దార్లు ఆయా లబ్ధిదారులకు సంబంధించి జతచేసిన అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, దస్త్రాలకు ఆమోదముద్ర వేశారు.

బాధితులు నిరాశ

సర్వ హక్కులు వచ్చాయని భావించి తమ కుటుంబ సభ్యుల పేర్లతో మార్చుకునేందుకు, ఇత రులకు విక్రయించేందుకు యత్నిస్తున్న సమయంలో చిక్కులు ఎదురవుతున్నాయి. అనేక ఇళ్లు నిషేధిత జాబి తాలోని సర్వే నంబర్లలో నిర్మించినట్లు అధికారులు గుర్తి స్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఉత్తర్వులు వస్తేనే వీటికి రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉండటంతో అనేక మంది నిరాశతో ఉన్నారు. జిల్లాలోని గూడూరు సబ్ రిజి స్ట్రార్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా 4488 ఫైళ్ళకు స్కాన్ చేశారు. ఓటీఎస్ పథకానికి ప్రభుత్వా నికి రూ. 90 కోట్లకు పైగానే ఆదాయం లభించింది. ఇంత డబ్బులు వసూలు చేసినా పలువురికి రిజిస్ట్రేషన్లు కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని దరఖా స్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయనే విషయమై స్పష్టంగా చెప్పలేమని అధికారులు అంటున్నారు.. ప్రభుత్వం ఇప్పటికైనా నిషేధిత జాబితాలో ఉన్న తమ భూముల సర్వే నంబర్లను తొలగించి రిజిస్ట్రేషన్లు అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాల పరిధిలోని...
దరఖాస్తులు: 72,681
ఆమోదించినవి: 71,085
తిరస్కరించినవి: 1,596



రెండు జిల్లాల్లో భారీగా దరఖాస్తులు

డీకేటి అసైన్డ్ భూముల్లో గృహ నిర్మాణం సంస్థ రుణం తీసుకుని ఇల్లు నిర్మించుకున్న వారికి పట్టాలు లేకపోవడంతో ఓటీఎస్ కు దరఖాస్తు చేసుకున్నారు. రెండు జిల్లాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి కానీ ప్రభుత్వం ఇంతవరకు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయలేదు.

2-11 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనం : ఈవో

ప్రజాశక్తి - తిరుమల

ఎక్కువ మంది సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు వీలుగా జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు అన్ని రకాల ప్రివిలైజ్ దర్శనాలు రద్దు చేసినట్టు, అర్జిత సేవలు ఏకాంతంగా నిర్వహించనున్నట్లు టిటిడి ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. వైకుంఠ ఏకాదశి దర్శనం ఏర్పాట్లపై శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో వివిధ శాఖల అధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. రోజుకు దాదాపు 80 వేల మందికి దర్శనం కల్పించనున్నారు. ఆర్జిత సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. అన్నిరకాల ప్రివిలేజ్ దర్శనాలను రద్దు చేసింది. శ్రీవాణి, ఎస్ఇడి టిక్కెట్లు, ఎస్ఎస్డి టోకెన్లు కలిగి ఉన్న భక్తులకు "మహా లఘు దర్శనం" కల్పిస్తారు.

దర్శన టికెట్లు కేటాయింపు ఇలా...


రోజుకు 25 వేలు చొప్పున 10 రోజులకు కలిపి 2.50 లక్షల రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 2023 జనవరి కోటాలోనే ఈ టికెట్లు విడుదల చేస్తారు. తిరుమల స్థానికుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన కౌంటరుతో పాటు తిరుపతిలోని తొమ్మిది కేంద్రాల్లో రోజుకు 50 వేలు చొప్పున మొత్తం ఐదు లక్షల ఎస్ఎస్డి టోకెన్లు జారీ చేస్తారు. ఆధార్ కార్డ్ తప్పనిసరిగా చూపి ఈ టోకెన్లు పొందాల్సి ఉంటుంది. ఎస్ఎస్డి టోకెన్లు జారీ చేసే తొమ్మిది ప్రదేశాలను రెండు క్లస్టర్లుగా విభజించి జెఇఓలు పర్యవేక్షిస్తారు. రోజుకు 2000 చొప్పున శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ప్రతిరోజూ 2000 మంది దాతలు తమ దర్శన కోటాను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వైకుంఠ ఏకాదశికి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే దర్శన టిక్కెట్లు కేటాయిస్తారు. సిఫార్సు లేఖలు తీసుకోబడవు. నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దష్ట్యా డిసెంబర్ 29 నుండి జనవరి 3 వరకు వసతి అడ్వాన్స్ బుకింగ్ రద్దు చేస్తారు. గదుల కేటాయింపులో పారదర్శకత పెంచేందుకు మరిన్ని కౌంటర్లు పెంచి సిఆర్వోలో మాత్రమే కేటాయిస్తారు. జెఇఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌వో నరసింహ కిషోర్, ఎస్‌విబిసి సిఇఓ షణ్ముఖ్ కుమార్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వర్ రెడ్డి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

టిటిడి బోర్డులో ఆర్థిక నేరగాళ్లకు ఉద్వాసన పలకండి : జనసేన

తిరుపతి(మంగళం): రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన ఆర్థిక నేరగాళు తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలకమండలి సభ్యులుగా పాగా వేసి అక్రమంగా దోచుకుంటున్నారని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కిరణ్ రాయల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిటిడి బోర్డు సభ్యులుగా కొనసాగుతూ తిరుమల స్వామి వారిని చూపించి కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సాహితీ ఇన్ఫ్రా ముసుగులో టిటిడి బోర్డు సభ్యుడు భూదాటి లక్ష్మీనారాయణ ఫ్రీ లాంచ్ స్కీమ్ తో కోట్ల రూపాయల స్కామ్ ను చేశారన్నారు. ఇందులో దాదాపు 900 కోట్లకు పైగా పేద ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకుని విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. ఇటువంటి ఆర్థిక నేరగాళ్లు ఇంకా ఉన్నారని అటువంటి వారి వలన తిరుమల తిరుపతి దేవస్థానానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు మునుస్వామి, ముక్కు సత్యవంతుడు, హేమకుమార్, బాబ్జి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కాట్ కష్ణప్రసాద్‌కు ఘన సన్మానం

తిరుపతి టౌన్ : పశ్చిమ గోదావరి ఏలూరుజిల్లా ఏలూరు పట్టణం నందు ప్రైవేట్ హొటల్ లో కాపు సంక్షేమసేన సమావేశం ఏలూరు జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు ఆధ్వర్యంలో శనివారం జరిగినది. సందర్భంగా యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దలు చేగొండి హరిరామ జోగయ్య కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల అభ్యున్నతికి కషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్కాట్ కష్ణప్రసాద్‌ను ఘనంగా శాలువ, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపుసంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ , ఏలూరుజిల్లా కాపుసంక్షేమసేన అధ్యక్షుడు పులి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి ప్రసాద్ సంయుక్త కార్యదర్శి బర్మా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



త్వరలో కోర్టు మార్గాల విస్తరణ

తిరుపతి(మంగళం): తిరుపతి కోర్టు సముదాయాల మార్గాలను త్వరలో విస్తరణ పనులు ప్రారంభం కానున్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ తిరుపతి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డికి వినతి ఇచ్చామని, ఈ వినతిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వారంలోపు ప్రకాశం రోడ్డు నుండి కోర్టుకు పోవు రోడ్డును 30 నుండి 40 అడుగులు విస్తరణ చేసి రోడ్డు నిర్మిస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి లీగల్ సెల్ నాయకులు దొరబాబు, రమణ, బాలాజీ, నరహరిరెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

భక్తుడు పోగొట్టుకున్న నగదు అప్పగింత

తిరుపతి సిటి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుడు పోగొట్టుకున్న నగదును సిబ్బంది నిజాయితీగా తిరిగి అప్పగించారు. ఆలయంలో కల్యాణోత్సవం సమయంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన కె.జనార్ధన్ శెట్టి రూ. 44,613 నగదు ఉన్న కవరు జారవిడుచుకున్నారు. అక్కడ వాహన బేరర్ గా ఉన్న మునిరెడ్డి గుర్తించి అధికారులకు అప్పగించారు. ఆర్జితం ఇన్స్పెక్టర్ ఏ.ధనశేఖర్, జమేదార్ చిరంజీవులు మైక్ లో ప్రకటన చేసి కె.జనార్ధన్ శెట్టికి సదరు నగదును అప్పగించారు.

వర్షాకాలం జాగ్రత్తలతో ఇళ్ల నిర్మాణాలు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వర్షాకాలం కనుక ముందు జాగ్రత్తలు తీసుకొని జగనన్న ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి అర్బన్ లబ్ధిదారులకు రేణిగుంట మండలం జీ పాళ్యాం వద్ద నిర్మిస్తున్న జగనన్న ఇళ్ళ నిర్మాణ పనులను అనుపమ అంజలి శనివారం పరిశీలించారు. ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ మహేష్, హౌసింగ్ డిఈ బాలాజీ, అమ్మెనిటి సెక్రటరీలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపక్కన వేయొద్దు

భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్ల పక్కన, నగరంలో ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అనుపమ అంజలి సిబ్బందిని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 8వ వార్డులోని సుభాష్ నగర్, సంజయ్ గాంధీ కాలనీ, కట్ట, ఎర్రమిట్ట, కరకంబాడీ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి, ఇంజినీరింగ్, హెల్త్ సిబ్బందితో కలసి శనివారం ఉదయం పరిశీలించారు. సుభాష్ నగర్ పెద్ద కాలువను పరిశీలిస్తూ కాలువల్లో చెత్త, మురుగునీరు నిలవకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, డి.ఈ. సంజయ్ కుమార్, శానిటరి సూపర్ వైజర్ సుమతి ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్

ప్రజాశక్తి - తిరుమల తిరుమల తిరుపతి దేవస్థానం నూతనంగా తీసుకున్న వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్పు చాలా మంచి నిర్ణయమని, సామాన్య భక్తులకు తెల్లవారుజామున దర్శనం టిటిడి కల్పించడం పట్ల తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈవో ధర్మారెడ్డి ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



ఎస్ఎస్ఆర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి స్వయానా బావమరిది సామాను శ్రీధర్ రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి ఆత్మ హత్యా ప్రయత్నం చేశారు. ఆస్తి తగాదాల వల్ల ఆయన ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టినట్టుగా తెలుస్తోంది. బావా బామ్మర్దుల మధ్య కొంతకాలంగా ఆస్తి తగాదాలు జరుగుతున్నట్లు జనాలు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో శ్రీధర్ రెడ్డి చేతిపై కత్తితో కోసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేయడం కలకలం సృష్టిస్తోంది. వ్యక్తిగత వైద్యుడు ఆయనకు చికిత్స చేసి కుట్లు వేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఆర్ ఇంటి వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ పక్కనే ఎమ్మెల్యే ఇల్లు ఉండడంతో శనివారమంతా హై టెన్షన్ నెలకొంది. పోలీసులు ఎస్ఎస్ఆర్ కు సర్ది చెప్పే ప్రయత్నం చేయడం గమనార్హం.

తెలంగాణాకు 'అమరరాజా'

రూ.9,500 కోట్లతో పెట్టుబడులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలుగుదేశం ఎంపీకి చెందిందన్న ఏకైక కారణంతో వేధింపులు పెచ్చుమీరడంతో అమరరాజా బ్యాటరీస్ రాష్ట్రంలో విస్తరణ పనులు నిలిపివేసింది. ఏకంగా 9వేల 500 కోట్ల పెట్టుబడితో తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లాలో కొత్త ప్లాంట్ ఏర్పాటుకు అక్కడి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను వైసీపీ ప్రభుత్వం చేజేతులా చెడగొట్టిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

వైసీపీ ప్రభుత్వ వేధింపులతో రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోయే పరంపర కొనసాగుతోంది. తాజాగా అమరరాజా బ్యాటరీస్ నూతనంగా చేపట్టనున్న విస్తరణ తెలంగాణకు తరలిపోయింది. పరిశ్రమలు పెడతామని ఎవరైనా ముందుకొస్తే ప్రభుత్వాలు వారికి ఎర్ర తివాచీలతో స్వాగతం పలుకుతాయి కానీ వైసీపీ ప్రభుత్వం తీరే వేరు..కొత్త పరిశ్రమల్ని ఆహ్వానించడం మాట అటుంచితే ఉన్నవాటినే తన్ని తరిమేస్తోంది.. కేవలం తెలుగుదేశం ఎంపీ గల్లా జయదేవ్ సంస్థ అన్న ఏకైక కారణంతో, రాజకీయ కక్ష సాధింపుతో అమరరాజా సంస్థపై జగన్ ప్రభుత్వం తీవ్రమైన వేధింపులకు పాల్పడింది. దీంతో చిత్తూరు జిల్లాలో ఆ సంస్థ విస్తరణ పనులు విరమించుకుంది. ఒకానొక దశలో తమిళనాడుకు తరలిపోవాలనుకున్నా..అమరరాజా సంస్థ ఆలోచన గురించి తెలిసిన తెలంగాణ ప్రభుత్వం..వారికి సాదర స్వాగతం పలికింది. పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇవ్వడంతో అత్యాధునిక లిథియం అయాన్ బ్యాటరీల పరిశోధన, తయారీ యూనిట్‌ను తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు అమరరాజా సంస్థ అంగీకరించింది. వచ్చే పదేళ్లలో 9వేల 500కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దేశంలో బ్యాటరీల తయారీ రంగంలో అమరరాజా ప్రముఖ స్థానంలో ఉంది. అలాంటి సంస్థ ఏకంగా 9వేల 500కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొస్తే..వెంటాడి వేధించి తరిమికొట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్న విమర్శలున్నాయి. వెనుకబడిన రాయలసీమలోని చిత్తూరు జిల్లాలో అమరరాజా ఫ్యాక్టరీతో ఇప్పటికే 20వేల మంది ప్రత్యక్షంగా, 50వేల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.ఆ సంస్థ మరో 9వేల 500కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమను ఇక్కడే ఏర్పాటు చేసి ఉంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొన్ని వేలమందికి ఉపాధి దొరికేది. ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీగా ఆదాయం వచ్చేది. పలు అనుబంధ పరిశ్రమలూ వచ్చేవి. పైగా రాబోయే కాలమంతా లిథియం అయాన్ బ్యాటరీలదే హవా. ఆ రంగంలో రాష్ట్రం పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయేది. పెద్దఎత్తున విస్తరణ చేపడుతున్న అమరరాజా సంస్థ..తెలంగాణతోపాటు తమిళనాడు, ఉత్తరభారత్‌లోని మరో రాష్ట్రంలోనూ పెట్టుబడులు పెట్టాలని చూస్తోంది. బ్యాటరీల తయారీలో నెంబర్‌వన్ స్థానంలో ఉన్న అమరరాజా సంస్థను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తమ రాష్ట్రానికి ఆహ్వానించారు. దీంతో అక్కడ కూడా పెట్టుబడులు పెట్టాలని అమరరాజా సంస్థ ఆలోచిస్తోంది.

వేధింపుల పరంపర కొనసాగిందిలా...

వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే అమరరాజా సంస్థపై వేధింపులు ప్రారంభమయ్యాయి. ఆ సంస్థకు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన 253 ఎకరాల భూముల్ని 2020 జూన్ 30న ప్రభుత్వం వెనక్కి తీసేసుకుంది. భూములు తీసుకుని పదేళ్లవుతున్నా..ఒప్పందం ప్రకారం వినియోగంలోకి తీసుకురాలేదంటూ వెనక్కి తీసుకుంది. దీనిపై ఆ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఒప్పందంలో పేర్కొన్న దానికన్నా ఎక్కువ మందికి ఉపాధి కల్పించడమే గాక..2వేల 700కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టామని చెప్పడంతో కోర్టు స్టే విధించింది. ఆ తర్వాత ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మరింత ఎక్కువయ్యాయి. 2021 ఫిబ్రవరి, మార్చి నెలల్లో విడతల వారీగా అమరరాజా బ్యాటరీ కంపెనీల్లో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు చేశారు. అక్కడ గాలిలో, మట్టిలో సీసం పరిమాణం నిర్దేశిత ప్రమాణాలకు మించి ఉన్నట్టు తమ అధ్యయనంలో వెల్లడైందని పీసీబీ తెలిపింది. ఉద్యోగుల రక్తంలోనూ నిర్దేశిత పరిమితికి మించి సీసం ఉనట్టు పరీక్షల్లో తేలిందని చెప్పింది. నిబంధనలు పాటించడం లేదంటూ చిత్తూరు జిల్లా నూనెగుండ్లపల్లి, కరకంబాడిల్లో ఉన్న అమరరాజా బ్యాటరీ తయారీ యూనిట్లు మూసేయాలని ఆదేశించింది. 2021 మే 1న అమరరాజా బ్యాటరీస్ పరిశ్రమకు ప్రభుత్వం ఏకంగా విద్యుత్ సరఫరా నిలిపివేసింది. పరిశ్రమలపై కక్షసాధింపునకు పాల్పడటం, ఏకంగా వాటిని మూసివేయించాలని చూడటం వల్ల వాటిలో పనిచేస్తున్న వేలమంది కార్మికులు, రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది.

కార్మికుల సంక్షేమం పట్టని టిటిడి

'కమిటీ'లతో కాలయాపన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'మానవసేవే మాధవసేవ' ని నిరంతరం వల్లించే తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ముందు సేవ చేసే కార్మికుల సంక్షేమం పట్టించుకునే పరిస్థితి లేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రచారాల్లో టిటిడి కార్మికులు, వారి కుటుంబాల ఓట్లు కొల్లగొట్టేందుకు ఎన్నో హామీలు ఇస్తారు. ఎంతో ఆశగా క్యూలైన్లలో నిలబడి మరీ ఓట్లేసి గెలిపిస్తే, తీరా అధికారంలోకి వచ్చాక 'ఏరు దాటాక బోడిమల్లన్న' అన్న చందంగా పాలకులు వ్యవహరిస్తున్నారు. శ్రీవారి భక్తులు, ఉద్యోగులు, కార్మికులు, స్థానికుల శ్రేయస్సే తమ బాధ్యతని పాలకమండలిలో ప్రమాణం చేసే ఏ సభ్యుడైనా విస్మరిస్తూనే ఉన్నారు. సామాన్య భక్తులను పట్టించుకోకపోగా విమానాల్లో, ఏసీ ట్రైన్లలో, ఏసీ కారుల్లో వచ్చే వివిఐపిలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. అలాగే తిరుమల తిరుపతి నగర ప్రజల అభివృద్ధే తమ ధ్యేయంగా చెప్పి ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో శ్రీవారి ఆలయాలు, కల్యాణ మండపాలు నిర్మిస్తూ టిటిడి ఖజానాకు తూట్లు పొడుస్తున్నారు. ఏడాదిక్రితం కురిసిన వర్షాలకు తిరుపతి అతలాకుతలం అయ్యింది. కనీసం దేవస్థానం జోక్యం చేసుకుని 'సాయం' చేసిన పాపాన పోలేదు. తుడాకు, మున్సిపాలిటీలకు ఇవ్వాల్సిన పన్నును 'సేవ' పేరుతో ఎగనామం పెడుతూ మొండిగానే వ్యవహరిస్తోంది. ఇక టిటిడిలో పనిచేసే శాశ్వత ఉద్యోగులు వారి చిరకాల వాంఛ ఇంటి స్థలాలు.

ప్రజా'దృష్టి'



దాదాపు రెండు మూడు దశాబ్దాల పాటు వారు చేసిన పోరాటం ఫలితంగా ఎట్టకేలకు స్థలం కొనుగోలుకు నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇప్పటికీ వారికి స్థలాలను చూపించలేదు. ఇదిలా ఉండగా స్విమ్స్‌లో ఇస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్యం సరిగ్గా లేదని, ఖాళీలు భర్తీచేసి అధునాతన వైద్యం అందించేలా అభివృద్ధి చేయాలని, లేదా తిరుపతి సమీపంలోని బెంగుళూరు, చెన్నయ్‌లోని కార్పొరేట్ వైద్యానికి రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ఎప్పటినుంచో ఉద్యోగులు కోరుతూనే ఉన్నారు. ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. ముఖ్యంగా గొడ్డుచాకిరీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు, కల్యాణకట్ట కార్మికులు, ఫారెస్టు కార్మికులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు టైంస్కేల్ ఇస్తామని గత టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం హామీలిచ్చాయి. జగన్ అధికారంలోకి వచ్చాయక లక్ష్మీ శ్రీనివాసం మ్యాన్‌పవర్ కార్పొరేషన్‌ను తీసుకొచ్చి విలీనం పేరుతో బలవంతంగా చేర్చే ప్రయత్నం చేస్తోంది. కల్యాణకట్ట బార్బర్లు ఆ కార్పొరేషన్‌లో చేర్చలేదని భక్తుల వద్ద లంచాలు తీసుకుంటున్నారని వారిపై విజిలెన్స్ వేధింపులు పెంచింది. టిటిడి అటవీ కార్మికులు 360 మంది ఉండగా అందులో 160 మందికి వైఎస్ఆర్ పార్టీ యూనియన్‌లో చేరిన వారికి ప్రత్యేక జీవో తీసుకొచ్చి రెగ్యులర్ చేసింది. అటవీ కార్మికుల పట్ల వివక్ష పాటించారు. మరో 200 మంది రెండేళ్లుగా సిఎం హామీని నెరవేర్చాలని రిలేదీక్షలు చేస్తున్నప్పటికీ పట్టించుకున్న దాఖలా లేదు. పోరాటాలు చేసిన ప్రతిసారీ కనీస వేతనాలకు సంబంధించి 'కమిటీ'లు వేయడం పరిపాటయ్యింది. తాజాగా బుధవారం జరిగిన పాలకమండలి సమావేశంలోనూ కనీస వేతనాలపై 'కమిటీ' వేస్తున్నట్లుగా ఛైర్మన్ ప్రకటించారు. ఇదిలా ఉండగా గోసంరక్షణ, హిందూ ధర్మపరిరక్షణ పేరుతో బిజెపి నాయకులు సూచిస్తున్న కార్యక్రమాలకు వందల కోట్లు కేటాయిస్తుండటం గమనార్హం. ఇదంతా చూస్తుంటే నిధులు లేకనా... నిర్లక్ష్యమా అన్నది శ్రీవారికే ఎరుక.

కల్లివెట్టు పాఠశాల విద్యార్థినికి ప్రతిభ అవార్డు



ప్రజాశక్తి-బివిఎన్‌కండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో విద్యార్థిని స్పందనకు ప్రతిభ అవార్డు ప్రదానం చేశారు. శనివారం ప్రొఫెసర్ వరదరాజన్ 12వ అంతర్జాతీయ సుస్థిర వ్యర్థాల నిర్వహణా కార్యక్రమం తిరుపతి నగరంలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గల సెనేట్ హాల్‌లో జరిగింది. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు వాణి పర్యవేక్షణలో పదవ తరగతి విద్యార్థి స్పందన తయారుచేసిన ప్రయోగం పది ఉత్తమ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఎంపికైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రొఫెసర్ వరదరాజన్ చేతులమీదుగా ధ్రువీకరణ పత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ కాన్స్ ప్రతినిధులు ధనంజయ సారథి, కోదండపాణిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు.

సిఐటియు అధ్యక్ష కార్యదర్శులుగా రేవతి, సుధాకర్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సిఐటియు తొట్టంబేడు మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షురాలుగా రేవతి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా గురునాథం, వాణి, సహాయ కార్యదర్శులుగా రామయ్య, అంకయ్య, ట్రెజరర్‌గా భారతి, కమిటీ సభ్యులుగా సుజాత, చెంగమ్మ వెంకటమ్మ, ఆర్ చెంగమ్మ, ధనలక్ష్మి, భవాని, సుబ్రమణ్యం వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటం చేద్దామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, గెడి వేణు పాల్గొన్నారు.

ఆశ వర్కర్స్ జిల్లా ప్రథమ

మహాసభను జయప్రదం చేయండి




ప్రజాశక్తి - పెళ్లకూరు : సిఐటియు ఆధ్వర్యంలో జరుగు ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఆశ వర్కర్స్ మండల అధ్యక్షురాలు భాగ్యమ్మ, కార్యదర్శి మణెమ్మ సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నాయుడుపేట సుందర్ రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో ఆశ వర్కర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయించే వెట్టి చాకిరి , ఆశా వర్కర్ల భవిష్యత్ కార్యాచరణ మొదలైన విధివిధానాలపై మహాసభ జరుగుతుందని, ఆశ వర్కర్స్ అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్‌లో ఉపాధి హామీ కూలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : నగరి, పుత్తూరు మండలం ఉపాధి హామీ కూలీలకు గత మూడు నెలల నుండి కూలి అందక అవస్థలు పడుతున్నారని టిడిపి ప్రధాన కార్యదర్శి బాలాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రక్క రాష్ట్రంలో ఎప్పటికప్పుడు కూలీలు జమ చేస్తున్నారని మన రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కూలీలు పెండింగ్‌లో ఉంది. దయచేసి అధికారులు, కలెక్టర్లు స్పందించి ఉపాధి హామీ పథకం కూలీలకు కూలి జమచేయాలని ఉపాధి హామీ కూలీలు ఆవేదన చెందు తున్నారు. సెప్టెంబరు నుండి ఇంతవరకు కూలి జమకాలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలి జమ చేయవలసిందిగా కోరారు.

తహాశీల్దార్‌ను కలిసిన కేఆర్ దాసరి



ప్రజాశక్తి -బాలాయపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రజా సంఘాల అధ్యక్షులు కె.ఆర్ దాసరి శనివారం బాలయ్యపల్లి తహశీల్దార్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాయపల్లి మండలంలో దళితులు సాగు చేసుకుంటున్న స్థలాలకు శాశ్వత హక్కు కల్పించాలని కోరారు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో దళితులు నివాస గృహాల వద్ద ఉన్న డ్రైనేజీ కాలువల స్థలాలు ఆక్రమించడంతో ఆ నీళ్లు రోడ్లపైనే పారుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ భూములు ఆక్రమణ చేపడుతున్నారని గుర్తు చేశారు. ఆయన వెంట ప్రజాసంఘాల నాయకులు సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం



శ్రీకాళహస్తి రూరల్‌లో..

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు, యంత్రాంగం: మండల రిసోర్స్ కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి సత్య నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి సహ కారంతో రాయితీ బస్సు పాస్‌లు, డిజేబుల్డ్ వెల్ఫేర్ ఆఫీస్, చిత్తూరు వారి సహకారంతో దివ్యాంగ పరికరాలు అందజేసారు. ఐఈఆర్పీలు పి.వెంకట రమణ, యం. రమణయ్య, ఎమ్మార్సీ సిబ్బంది, ప్రాథమిక పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బిఎన్‌కండ్రిగ మండలంలోని భవిత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా స్థానిక జెడ్పిటిసి ఆరని ప్రతిమారెడ్డి హాజరై చెవుడు, మూగ పిల్లలకు మాట్లాడించే పరికరాన్ని బహుమతిగా ఇస్తానని ఆమె తెలియజేశారు. అనంతరం జెడ్పిటిసి, విద్యాశాఖ అధికారి చేతుల మీదగా పిల్లలకు ట్రైసైకిళ్లు, చెవి మిషన్లు పంపిణీ చేశారు. పిల్లలకు స్వీట్లు మిఠాయిలు పంచి పెట్టారు. పిచ్చాటూరులోని భవితా కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారిణి కె.హేమమాలిని అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా తహశీల్దారు మధుసూదన్ రావు, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు పాల్గొ న్నారు. యుటిఎఫ్ పిచ్చాటూరు శాఖ ఉపాధ్యాయులు దివ్యాంగుల పిల్లల కోసం ప్లేట్లు, వీఆర్ఏ జి.శివకుమార్ లంచ్ బాక్స్, బుక్స్, పెన్స్, ప్రేమ్ కుమార్ భవిత కేంద్రానికి రూ.5వేలు విరాళం అందించారు. ఎంపీపీ ఉపాధ్యాయుడు మదన్ ముసురు, దేవదాస్ వీఆర్వో విద్యార్థులకు, అతిథులకు భోజనం అందించారు. తహశీల్దారు, మండల విద్యాశాఖ అధికారి అధ్యక్షులు వారి చేతుల మీదుగా సమగ్ర శిక్ష వారు విద్యార్థులకు వినికిడి పరికరాలను, వీల్ చైర్స్, రోలేటర్ అందజేశారు. శ్రీకాళహస్తి రూరల్ మండల కేంద్రంలోని స్థానిక భవిత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి పాల్గొని భవిత పాఠశాలకు కావలసిన ఉపకరణాలను అందజేశారు. అలాగే మండల విద్యా వనరుల శాఖ అధికారిని ఆర్. భువనేశ్వరి యాస్ ఆర్గనైజేషన్ సంస్థ విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందజేశారు. వరదయ్యపాలెం మండలంలోని స్థానిక ఎమ్మార్సీ ఆవరణంలో మండల విద్యా శాఖాధికారి సరస్వతి మాట్లాడుతూ మండలంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేక విద్య అందిస్తూ వారికి అవసరమైన వివిధ పరికరాలను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందన్నారు. వీరికి ప్రతి వారం పిజియోథెరపి నిర్వహిస్తున్నారని తెలిపారు. తిరుపతి జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వారిని ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయి ఎదుగుతారని తెలిపారు. **క్యాంపస్ :**శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, విద్యా విభాగం అంతర్జాతీయ దివ్యాంగుల రోజును పురస్కరించుకుని విద్యార్థినులు శ్రీష్ మందిర్ ప్రత్యేక పాఠశాల విద్యార్థులతో కలిసి ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వైకల్యాలకు గల కారణాలు, నివారణ, ప్రభుత్వ పథకాలు మరియు సదుపాయాలూ వంటి అంశాల పై భాగ్యలక్ష్మి, ఉషారాణి ఆశాజ్యోతి, అనసూయమ్మ మాట్లాడారు. గూడూరు షాదీమంజిల్‌లో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ హాజరయ్యారు. వివిధ రంగాల్లో ముందుకు వెళ్తున్న పలువురు దివ్యాంగులను ఆమె సన్మానించారు. పిఎస్ఆర్ ట్రస్ట్ తరపున రూ.50వేల విరాళాన్ని రెడ్ సంస్థకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే గూడూరు పట్టణ రోటరీ క్లబ్ అధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారంస్థానిక రోటరీ భవనంలో బూడిదవాక రత్నమాచారి, ప్రభావతి వారి దాతృత్వంతో దివ్యాంగులకు వస్త్రాలు ప్రదానం చేశారు. అలాగే దివ్యాంగులకు మరో రూ.55 వేలు అందజేస్తామని దేవసేనమ్మ పేర్కొన్నారు. తడలోని భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతులకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లిఖార్జున రావు, నరసింహారావు చేతుల మీదుగా ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. రేణిగుంటలోని అక్షయ క్షేత్రంలో ఆశ సంస్థ అధ్యక్షులు జులియన్ రాజు, ఆషా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రేణిగుంట సర్పంచ్ నగేష్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై పండ్లు తేనేటి విందు ఇచ్చారు. పాకాల మండలంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖాధికారి బాబ్జి హాజరై ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన వినికిడి యంత్రాలు, రోలేటర్ (నడవలేని పిల్లల కోసం ఇచ్చేది), అందరికి ప్లేట్లు పంపిణీ చేశారు. పుత్తూరుటౌన్‌లోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి అధ్యక్షతన ఎంపీపీ మునివేలమ్మ చేతుల మీదుగా వినికిడి యంత్రం, వీల్ ఛైర్ రోలేటర్లు, నోట్ పుస్తకాలను, బహుమతులు స్వీట్లు అందించారు. తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని బైరాగిపట్టెడ భవిత సెంటర్లో దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఆనంద రెడ్డి, స్థానిక కార్పొరేటర్ తూకివాకం శాలిని మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. దివ్యాంగ విద్యార్థులకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, రోలేటర్స్ సహిత విద్య సమన్వయకర్త రామచంద్ర రెడ్డి ద్వారా అందించారు. గత మూడు రోజులుగా భవిత సెంటర్ ఐఈఆర్ టి భవాని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బి సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తహసున్నీసా బేగం బహుమతులు అందజేశారు.

బాలాయపల్లి: మండలంలోని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం భవిత కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకార వేతనాలు, వినికిడి యంత్రాలు, ప్రత్యేకంగా ఆరోగ్య సదుపాయాలు ఏర్పాటు చేసిందన్నారు. తొట్టంబేడు మండలంలోని బసవయ్య పాలెంలో ఉన్న భవిత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి భారతి, ఐఈఆర్‌టి చైతన్య ఆధ్వర్యంలో తొట్టంబేడు మండల వైసీపీ నాయకులు కలవగుంట భరత్ రెడ్డి చిన్నారులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు , క్యారియర్లను అందించారు.

నాయుడుపేట: మండలంలోని ఎంఈఓ కార్యాలయం పరిధిలోని ఆర్ముగం నగర్‌లో గల భవిత కేంద్రంలో దివ్యంగుల దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎస్.కోమల దేవి దివ్యాంగ పిల్లలకు అవసరమైన 4 వీల్ చైర్లు, 6 వినికిడి యంత్రాలు, బహుమతులు అందజేశారు. అన్నమేడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.ముని రత్నం, పుదూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మనోజ్ కుమార్ ఉన్నారు

చిల్లకూరు: చిల్లకూరులోని భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ శ్రీహరి పిల్లలకు పాటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో భోజనం అందజేశారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యా విధానం

అదనపు గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ప్రజాశక్తి -సత్యవేడు: కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తున్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గుర్తు చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను ఆయన ప్రారంభోత్సవం చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జెడ్పిటిసి విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాలాజీ రెడ్డి, బెల్ట్ రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేటు విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ బడులలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ దుస్తులు, బెల్టు, పాదరక్షకులు, బ్యాగు తదితర వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకు తగ్గట్టు విద్యార్థులలో విద్యా సామర్థ్యాలు పెంపొందించేటట్టు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో జరిగిన జగనన్న క్రీడా పోటీలలో కబడ్డీ విభాగంలో పాల్గొని విజేత జట్టు బాలికల క్రీడాకారులను ఎమ్మెల్యే ఆదిమూలం అభినందించారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, మండల వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపిటిసి శరవణ, సర్పంచులు గోవింద్ స్వామి, రూబెన్, శేఖర్, వైసీపీ నేతలు గురుప్రసాద్, రమణ రాబర్ట్, మాజీ సర్పంచ్ గోవిందస్వామి, టెంకాయ కిష్టయ్య, సోమశేఖర్, కుమార్, ఎంపీ రవి, మునికృష్ణయ్య, అపరంజి రాజు,పెద్దిరెడ్డి వంశి రెడ్డి,భవన గుత్తేదారులు చిట్టిరెడ్డి, తహశీల్దారు సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో విజయకుమారి పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అందరం కలిసి పని చేద్దాం :ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి-బాలాయపల్లి : మండల శాఖ అధికారులు ప్రజా ప్రతినిధులు అందరం కలిసి పనిచేసి మండల అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ మండలమీట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు వారాల క్రితం వచ్చిన వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం కుంటుపడి అంటువ్యాధులతో ప్రజలు అల్లాడుతున్నారని, అధికారులు వారికి అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. అలిమిలి గ్రామంలో డెంగు పాజిటివ్‌తో ప్రజలు అలమటిస్తున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పిరమిడ్ గ్రామంలో తాగునీటికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురై రెండు నెలలవుతున్నా మరమ్మతులు చేపట్లదని చెప్పడంతో ఎంపీపీ ఆ శాఖ అధికారులపై మండిపడ్డారు.

గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానం:

మండలంలోని కరిమెనిగంట గ్రామ రోడ్డు అధ్వానంగా ఉందని, కనీసం ఆ గ్రామానికి ప్రభుత్వం అందించే వైద్య సేవలు అందడం లేదని తెలియజేశారు. అంతేకాకుండా పల్లెలకు వెళుతున్న లింక్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఎంపీపీ ఆదేశించారు. రైతులకు ఎరువులు కొరత లేకుండా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. మండలంలో భూ సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని చెప్పారు. సచివాలయం సిబ్బంది తమ పరిధిలో ఉన్న గ్రామాలను ప్రతి ఇంటిని సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపిడిఓ వినీల్ కుమార్, తహశీల్దార్ అజ్మితుల్లఖాన్, వైస్ ఎంపీపీ వాన పార్వతి, మండల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని పలు పంచాయతీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రామాపురం పంచాయతీ, అబ్బాభట్లపల్లి, వేడం పంచాయతీ, యార్లపూడి, వేలంపాడు, ఊరందూరు, మద్దిలేడు, అమ్మపాలెం, పుల్లారెడ్డి కండ్రిగ ఈ పంచాయతీల్లో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డా.వి.రాజాకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - సూళ్లూరుపేట: సూళ్లూరుపేట ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న భౌతికశాస్త్ర అధ్యాపకులు డా.వి.రాజా ఆధ్వర్యంలో " ప్రిపరేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ పివిడి యస్ కో హెచ్‌ఫ్‌పి బేస్డ్ నానో కాంపోజిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ ఫిలిప్స్ ఫర్ సాలిడ్ స్టేట్ బ్యాటరీ అప్లికేయన్స్" అనే అంశం మీద ఎన్.రామయ్య పరిశోధన చేసినందుకు డాక్టరేట్ పట్టాను వీఎస్‌యూనివర్సిటీ నెల్లూర్ వారు ప్రదానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో గైడ్ రాజా, పరిశోధకుడు రామయ్యని శాలువతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలం లోని సిరుగురాజుపాలెం పంచాయతీలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ మురళీమోహన్ పర్యవేక్షించారు. శనివారం ఉపాధి కూలీలు చేత రోడ్డు పక్కన చెట్లను నాటించి, వాటిని గ్రామ ప్రజలు కాపాడాలని కోరారు.

క్రైం న్యూస్

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మండలంలోని ఏపీఎల్ ఫ్యాక్టరీ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. చెన్నై నుండి నెల్లూరు వైపు వెళుతున్న కంటైనర్ లారీ, మోటార్ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తమిళనాడు వాసిగా ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



ప్రజాశక్తి - పాకాల: మండలంలోని 8 పోలీస్ స్టేషన్‌లకు సంబం ధించిన కేసులో నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని సిఐ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడి దగ్గర నుంచి 334 గ్రాముల బంగారం 570 గ్రాముల సిల్వర్, ఒక లాప్టాప్, రెండు సెల్ ఫోన్స్ ఒక ఐరన్ రాడ్ సీల్ చేయడం జరిగిందన్నారు. ఇతనిపై పాకాల పోలీస్ స్టేషన్లో మూడు కేసులు ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, చంద్రగిరిలో ఒక కేసు యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు రామచంద్రాపురం పోలీస్ స్టేషన్లో కేసు ఉందన్నారు. ఇతని పూర్తి పేరు రాఘవన్ విజయ్, శివ, వెంకటేష్. వయసు 45 సంవత్సరాలు. తండ్రి రాఘవన్ ఇరవకోటై వాలాజ పాతిపేట ఇతను ప్రస్తుతం నివసిస్తున్న స్థలం వందవాసి డోర్ నెంబర్ 87. ఇవి రోడ్డు వేలూరు తిరుమలమలై జిల్లా. ఇంతకముందు పది సంవత్సరాలపాటు దొంగతనం కేసులో శిక్ష అనుభవించాడని తెలిపారు. శిక్ష నుంచి బయట వచ్చాక మళ్ళీ దొంగతనానికి అలవాటు పడ్డాడు. పాకాలకు ట్రైన్లో చేరుకొని దొంగతనాలు మొదలుపెట్టాడు. అతనిని నేంద్రగుంట నుంచి దామల చెరువుకు వెళ్ళు మార్గం మధ్యలో రైల్వే గేట్ బస్టాప్ దగ్గర అదుపులోకి తీసుకొని అతను దొంగతనం చేసిన మొత్తాన్ని రికవరీ చేయడం జరిగిందన్నారు.

శ్రీపద్మావతి జూనియర్ కళాశాలలో..

'గీతా జయంతి' వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న విద్యాసంస్థ అయిన శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో గీతా జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి. భువనేశ్వరి, విద్యార్థినులు , అధ్యాపకులు 12వ అధ్యాయమైన భక్తి యోగంలోని 20 శ్లోకాలను పారాయణం చేశారు. అనంతరం భగవద్గీతలోని భక్తి యోగంలోవున్న శ్లోకాలను నెలరోజుల పాటు విద్యార్థినులకు ఎంతో చక్కగా నేర్పించిన డాక్టర్ కల్పనను ప్రిన్సిపాల్ అభినందించారు. అధ్యాపక అధ్యాపకేతర బృందం భగవద్గీత పారాయణంలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు.

ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో.. ఎస్‌విఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ అధ్యక్షతనభగవద్గీత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హేమంత్ కుమార్, నల్లన్న ప్రసంగించారు. వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భీమన్న, లోకనాథ మందడి, సూర్య నారాయణ రెడ్డి, మునస్వామి ఆచారి, శోభా, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీది అరాచక పాలన

టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శ



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: మూడున్నర సంవత్సర కాలంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగించిందని టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. శనివారం దేవేంద్ర థియేటర్ సమీపంలో 'వైసిపి కాలంలో ఇదేమి ఖర్మ కార్యక్రమంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు దౌర్జన్యాలు, అరెస్టులు, భూకబ్జాలు, అవినీతి పాలన సాగించారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీకి గుణపాఠం నేర్పాలని ప్రజలకు హితవు పలికారు. టిడిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విధంగా ప్రజలు రానున్న ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, టిడిపి నగర అధ్యక్ష కార్యదర్శులు చిన్నబాబు, మహేష్ యాదవ్, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తెలుగు మహిళ నాయకురాలు బ్యాంకు శాంతమ్మ, నాయకులు ఊక విజయ్ కుమార్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లులు చెల్లించండి

తొట్టంబేడు: మండలంలోని లింగామానాయుడుపల్లి పంచాయతీలో హౌసింగ్ పథకంలో నిర్మించిన ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించక పోగా మొండి గోడలతో ప్రజలు వర్షానికి బిక్కు బిక్కుమని బతకాల్సిన పరిస్థితి దాపురించిందని ఇదేం ఖర్మ మాకు అని గ్రామ ప్రజలు రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు వద్ద ఆవేదన వ్యక్తం చేసారు. అంతే కాకుండా పంచాయతీలో తెలుగుదేశం పార్టీ హయాంలో బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి చేసిన అభివృద్ధి తప్పు ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సూన్యం, చెరువులు మరమ్మతు పనులు చేయకపోగా చుక్కనీరు కూడా చెరువులో నిలిచే పరిస్థితి లేదన్నారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులుగా బతకాల్సిన పరిస్థితి దాపారించ్చిందని ఆవేదన వ్యకం చేశారు. మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు, శంకర్ నాయుడు,బాలాజీ, కమలాకర్,శ్రీనివాసులు, చిన్న రంగయ్య, కోప్పల అంకయ్య, వినాయక, సురేష్, గంగయ్య, వినోద్, రూపేష్, పెద్ద రంగయ్య, ఓసురయ్య, గంగయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నరు.

ఆడబిడ్డలకు భద్రతేది..!!



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జగన్ రెడ్డి పాలనలో ఆడబిడ్డలకు భద్రత లేకుండా పోయిందని, గంటకో హత్య, అత్యాచారాలు జరుగుతున్నాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శించారు. 'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆరో వార్డులో ఆయన పర్యటించారు. బాదుడే బాదుడు ద్వారా ప్రజల డబ్బులు దోచుకున్నాడని, మద్యం లేకుండా చేస్తానని ఎన్నికల ముందు చెప్పి ఆఖరికి మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చాడని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పి టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

వేళకు రారు..ప్రజా సమస్యలు పట్టించుకోరు..!!

- ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని సమయపాలన
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



తొట్టంబేడు సచివాలయం



ఏపీఎం కార్యాలయం ఖాళీగా దర్శనమిస్తున్న ఏపీఎం కుర్చీ

ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు సమయపాలన పాటించడం లేదు.. వారికి ప్రజా సమస్యలంటే గిట్టడం లేదు. "మొక్కుబడిగా కార్యాలయాలకి వచ్చామా..! రిజిస్టర్లలో సంతకాలు పెట్టామా..! నెలబెడితే వేలకు వేలు జీతాలు తీసుకున్నామా..!" అన్న చందాన వారి తీరు ఉంటోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల వద్దకే పాలన అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాల యాలల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదనీ, కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. శనివారం పలు ప్రభుత్వ కార్యాలయాలను, సచివాలయాలను ప్రజాశక్తి పరిశీలించగా ఈ నిజాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి పోతే... తొట్టంబేడు మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం కార్యాలయానికి ఎప్పుడు వస్తారో తెలియదు. ఎప్పుడు వెళతారో తెలియదు. ఈయన ప్రతిరోజు కార్యాలయానికి 12 గంటల పైన లేదంటే సాయంత్రంగా కార్యాలయానికి చుట్టం చూపులా వస్తూ ...పోతూ ఉంటారు. ప్రతి కార్యాలయాల్లో ఏ అధికారి ఎన్ని గంటలకు వస్తున్నారో తెలుసుకోవడానికి మూమెంట్ రిజిస్టర్‌లో అధికారులు సంతకం చేస్తూ ఉంటారు. అయితే ఈ కార్యాలయ అధికారులకు మూమెంట్ రిజిస్టర్ అంటేనే తెలియదు. అంటే ఏ అధికారి ఎప్పుడైనా రావచ్చు ఎప్పుడైనా వెళ్లొచ్చు ఉన్నతాధికారుల సైతం ఈ అధికారులు ఎన్ని గంటలకు కార్యాలయానికి వస్తున్నారో. చూడాలంటే కార్యాలయంలో ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకోవాల్సిందే. ఇంత జరుగుతున్నా ఈ కార్యాలయంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.సుదూర మార్గాల నుంచి వచ్చిన మహిళా సంఘాల మహిళలు ఈ అధికారి కోసం వేచి చూడాల్సిందే. ఆయన వచ్చేవరకు చెట్ల కింద పడుకోని విసిగి వేసారి కొంతమంది తిరిగి వెళ్ళిపోతారు. మరి కొంతమంది ఆకలితో అలమటిస్తూ ఎదురుచూస్తూ ఉంటారు. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ కార్యాలయంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని తొట్టంబేడు పంచాయతీలో ఉన్న రెండవ సచివాలయం అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ సిబ్బంది కచ్చితంగా 10 గంటలకు కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేయాలని పదే పదే చెబుతూ ఉంటారు. అయితే ఈ కార్యాలయానికి 11 అవుతున్నా సచివాలయ సిబ్బంది రారు. వీళ్లు ఈ బయోమెట్రిక్ ఎలా వేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ఎక్కడో ఉన్న బయోమెట్రిక్ అయితే వేస్తున్నారట అది ఎలా వేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. మండల కార్యాలయానికి పలు సమస్యల కోసం ప్రజలు వెళ్లి వేచి చూస్తున్నారని ఆయా పంచాయతీలలోనే సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు చేరువలో అధికారుల్ని ఏర్పాటు చేసినప్పటికీ మండల స్థాయి కార్యాలయాలే మేలు అనుచందాన సచివాలయాలు పనితీరు ఉంది. శనివారం ప్రజాశక్తి సచివాలయాన్ని పరిశీలించగా 11 అవుతున్నా కార్యాలయానికి ఇద్దరే అధికారులు వచ్చారు. మిగిలిన వారు కాన రాలేదు. ఇలా జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు స్పందించరో అర్థం కాని పరిస్థితి. పంచాయతీ ప్రజలు అధికారుల కోసం పడుగాపులు కావలసిన పరిస్థితి నెలకొంటుంది. ఉన్నతాధికారులు సచివాలయాలపై దృష్టి పెట్టి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జనసేన పట్టణ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గూడూరు రూరల్: నూతనంగా ఎంపికైన జనసేన పార్టీ గూడూరు పట్టణ కమిటీ కార్యవర్గం పట్టణంలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు విస్తృతంగా కార్య క్రమాలు నిర్వహించాలని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ సూచించారు. గూడూరు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం 24 మందితో కూడిన పట్టణ కార్యవర్గాన్ని పార్టీ ఆదేశాల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి ఆమోదంతో పట్టణ అధ్యక్షులు పెద్దిశెట్టి ఇంద్రవర్ధన్ నియమించారు. ఈ మేరకు గూడూరు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ నూతన పట్టణ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్ పట్టణ కమిటీ కార్యవర్గ సభ్యులకు సంబంధించిన నియామక పత్రాలను అందచేసి అభినందించారు. జనసేన పార్టీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు విజయ్, ఇమ్రాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శులు నాగార్జున, విష్ణు వర్ధన్, వంశీకృష్ణ, రామసాయి, కార్యదర్శులు రఘు, సనత్, దార కుమార్ శంకర్, కిషన్, సాయికృష్ణ పాల్గొన్నారు.

